క్లుప్తంగా

పేదలకు అండగా 'అలయన్స్ క్లబ్'



సామగ్రి అందజేస్తున్న బాలచంద్రన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బాలచంద్రన్ సిద్దిపేట విజిట్‌లో భాగంగా జిల్లా అలయన్స్ క్లబ్ సభ్యులు వైశ్యభవన్‌లో పలు కార్యక్రమాలు చేశారు. ఖాజీపూర్‌కు చెందిన పేద వధువుకు పుస్తె,మట్టెలు, చీరె, గాజులు, గృహ వినియోగ వస్తువులు, నగదును అందించారు. ఈ సందర్భంగా బాలచంద్రన్ మాట్లాడుతూ అలయన్స్ క్లబ్ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆత్మారాములు, బాలచంద్రం, వైకుంఠం, అంతయ్య, సూర్యనారాయణ, రాజు, శ్రీనివాస్, ఆంజనేయులు, శివకుమా, శోభారాణి, ప్రసన్న, మాధవి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఏఈ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు ఇస్తారి మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్‌లో వోల్టేజీ సమస్య వల్ల మోటర్లు, టీవీలు కాలిపోతున్నాయన్నారు. గత ప్రభుత్వం సబ్ స్టేషన్‌ను మంజూరు చేసిందని. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదగిరి, రాజు, ఎల్లయ్య, గోరేమీయా, పాశం చంద్రయ్య, అంజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

గజ్వేల్: సీఎం సహాయనిధి పేదలకు వరమని మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు కర్ణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శివారెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతి నక్షత్రోత్సవం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సిద్దిపేటరూరల్: పుల్లూరు లక్ష్మీనరసింహస్వామి క్షేత్రమైన బండపై నరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతీనక్షత్రోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకుడు రంగాచారి మాట్లాడుతూ ప్రతీనెల చివరి వారంలో ఈ ఉత్సవం నిర్వహిస్తామన్నారు. వంశపారంపర్య అర్చకులు రామకృష్ణచారి, శ్రీనివాసచారి, నచికేత, నాగరాజు, మురళి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ సిద్ధం



తోటపల్లిలోని ఓపెన్ జిమ్

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని తోటపల్లిలో ఓపెన్ జిమ్ ప్రారంభానికి సిద్ధమైనట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు గురువారం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిమ్‌ల నిర్మాణాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ 40 గ్రామాలకు రూ.5లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలోనే ప్రారంభించి అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

పోషకాల అజొల్లా

జీవన ఎరువుతో పంటలకు పోషణ
- తక్కువ శ్రమ, తక్కువ ఖర్చు
- రసాయన ఎరువులకు చెక్

వ్యవసాయరంగంలో పశువుల వినియోగం పూర్తిగా తగ్గిపోయి యంత్రాలు వచ్చిచేరాయి. అలాగే రసాయన ఎరువులకు రైతులు అలవాటు పడ్డారు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం పెరిగింది. దీనివల్ల భూసారంపై ప్రభావం పడి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



పొలంలో తేలియాడుతున్న అజొల్లా నాచు మొక్కలు



మల్లేశం, ఏఓ, మిరుదొడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): భూమిలో పోషకాలు పెంచుకోవడం, దిగుబడి అధికంగా సాధించడం సేంద్రియ ఎరువులతోనే సాధ్యం. అందుకు సిద్ధంగా లభించే జీవన ఎరువుల్లో అజొల్లా ఒకటి. ఈ సూక్ష్మ నాచు మొక్కలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మండల వ్యవసాయ అధికారి మల్లేశం తెలిపారు. నీరు నిలువ ఉన్న వరి పొలాల్లో ఇది సాగు చేయడం వల్ల వరికి పుష్కలమైన లవణాలు అందుతాయని, అధిక దిగుబడులు సాధించ వచ్చంటున్నారు. అంతటి ప్రాముఖ్యం ఉన్న అజొల్లా జీవన ఎరువుపై ఆయన తెలిపిన వివరాలు..

ఖర్చు లేకుండా..

అజొల్లా నాచు మొక్కలు సహజ సిద్ధంగా పెరుగుతాయి. వాటిని రైతులు తక్కువ శ్రమతో, పైసా ఖర్చు లేకుండా పెంచుకోవచ్చు. ఇది వరి పొలాలు, బురద నేలలు, చెరువులు, కుంటలపై నీటిపై తేలియాడుతూ పెరుగుతుంది. నీరు అనుకూలంగా ఉంటే చాలు అన్ని కాలాల్లో జీవన ఎరువుగా పెంచుకోవచ్చు.

సేంద్రియ ఎరువుగా

అజొల్లా నాచు మొక్కలు గాలిలోని నత్రజనిని తీసుకొని పంటలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. 150కిలోల యూరియాలో లభించే లవణాలు 50కిలోల అజొల్లా నాచు మొక్కల్లో లభిస్తాయి.

రసాయన ఎరువులకు దీటుగా

అజొల్లా నాచు మొక్కలను ఆరబెట్టి సేంద్రియ ఎరువుగా దుక్కిలో సైతం కలియదున్నుకోవడం వల్ల అధిక లాభాలు పొందవచ్చు. వాటిలో ఉండే పోషక విలువలు వరికి జీవం పోస్తుంది. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవచ్చు.

తక్కువ సమయంలో..

అజొల్లా అతి తక్కువ సమయంలో తడి ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా విస్తరిస్తుంది. శరవేగంగా పెరగాలంటే పొలంలో తగినంత పశువుల ఎరువును చల్లుకుంటే మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఇవి సాధారణంగా తగినంత నాచు మొక్కలను తీసి మరో పొలంలో వేసుకున్నట్లయితే తడి ఉన్నంత సేపు అనతి కాలంలోనే పొలమంతా విస్తరిస్తుంది.

కలుపు నివారణలో కీలకం

వరిలో పెరిగే కలుపు మొక్కలను అజొల్లా పూర్తిగా నివారిస్తుంది. పొలాల్లోని నీటిపై తేలుతూ పెరగడం వల్ల సూర్యరశ్మి నీటిపై పడకుండా నిరోధిస్తుంది. దీని వల్ల పొలంలో నీరు ఆవిరి కాకుండా ఎక్కువ రోజులు నిలువ ఉండటమే కాకుండా కలుపు మొక్కలను పెరగకుండా ఆపుతుంది.

పశువులకు మేతగా

అజొల్లా నాచు మొక్కలను ఆరబెట్టి పశువుల దానాలో కలిపి మేతగా కూడా వేయవచ్చు. దానివల్ల పాడి పశువులు అధిక పాల దిగుబడినిస్తాయి. పాలల్లో వెన్నశాతం కూడా ఘణనీయంగా పెరుగుతుంది. తద్వారా పాడి రైతులు అధిక ఆదాయం పొందవచ్చు. నాచు మొక్కలను కోళ్లకు కూడా దానాగా అందించి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు.



జగదేవ్‌పూర్(గజ్వేల్): భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకుడు

పేదల కోసమే సీపీఐ ఆవిర్భావం

- రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దయానంద్‌రెడ్డి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు

జగదేవ్‌పూర్(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్)/సిద్దిపేటఅర్బన్/హుస్నాబాద్ రూరల్/చేర్యాల(సిద్దిపేట): సీపీఐ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల వద్ద జెండాలు ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి స్వీట్‌లు పంచుకొన్నారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దయానంద్‌రెడ్డి మాట్లాడుతూ పేదల వర్గాల కోసమే భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. 1925లో కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భావించి నేటికి వందేళ్లు పూర్తయిందని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భిక్షపతి, నర్సింహారెడ్డి, లింగం, కరుణాకర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, దేశిరెడ్డి, ఎల్లారెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి రూపేశ్, అశోక్‌రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, మహేశ్, శ్రావణ్, చరణ్, గుండయ్య తదితరులు పాల్గొన్నారు. అక్కన్నపేటలో జరిగిన వేడుకల్లో మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ సంపదను అదాని, అంబానీలకు కట్టబెట్టి ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని వాపోయారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు వనేశ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడారు. లక్ష్మణ్, శంకర్, బన్సీలాల్, మల్లేశం, హరిఫ్, చంద్రం, జనార్దన్, సంపత్, భిక్షపతి, ప్రసన్నకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్‌రూరల్ పందిల్ల, గాంధీనగర్, మహ్మదాపూర్, పొట్లపల్లి, పోతారం(ఎస్), మీర్జాపూర్, కూచనపెల్లి గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర నాయకుడు గడిపె మల్లేశ్ మాట్లాడారు. సంజీవరెడ్డి, కుమారస్వామి, కనక స్వామి తదితరులు పాల్గొన్నారు. చేర్యాలలో జరిగిన వేడుకల్లో జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడారు. భూమయ్య, యాదగిరి, భాస్కర్‌రెడ్డి, మమత, బాల్‌మోహన్, సుదర్శన్, మహేందర్, కనకయ్య, భద్రయ్య, నర్సింహులు, సత్తయ్య, ప్రేమ్‌కుమార్, రాజు, అశోక్, కిష్టయ్య, సత్యనారాయణ, స్వామిదాసు, వెంకటయ్య, వితలయ్య, అజీమ్, అరుణ్, నాగరాజు, సురేశ్, నరేశ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేట(హుస్నాబాద్): చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న భాస్కర్ తదితరులు

పాతరోడ్డు కబ్జాకు యత్నం

- అడ్డుకున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లోని పాత ఆర్అండ్‌బీ రోడ్డును కొందరు రియల్టర్‌లు కబ్జాచేసి ప్లాట్లుగా మార్చారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు వాటిని తొలగించి పాతరోడ్డుకు హద్దులు పాతారు. సిద్దిపేటకు చెందిన రియల్టర్‌లు గురువారం అక్కడకు చేరుకుని రోడ్డును కబ్జా చేయడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రియల్టర్‌లతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు చేరుకుని రెండు వర్గాలను సముదాయించారు. ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుని యాథావిధిగా పాతరోడ్డు ఉండేలా చూడాలని, ఈ విషయంపై పోలీసులకు, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

680 మందికి వైద్య పరీక్షలు

- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి తరలివచ్చిన రోగులు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలో సురభి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, సురభి మెడికల్ కళాశాల(మిట్టపల్లి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి పీఆర్‌ఓ పరశురాములు మాట్లాడుతూ 680మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామన్నారు. సుమారు 30మంది వైద్యులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, స్త్రీల వైద్య నిపుణులు సేవలందిచారని, మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, ధర్మయ్య, వేదేందర్‌రావు, రాజయ్య, జయరాజ్, జగన్‌రెడ్డి, లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి, సంతోష్ రెడ్డి, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేవల్ కిషన్ పోరాటాలే స్ఫూర్తి

- సీపీఎం నాయకులు
- పలుచోట్ల వర్ధంతి కార్యక్రమాలు

సిద్దిపేటఅర్బన్/గజ్వేల్‌రూరల్/దుబ్బాక: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం నాయకుడు కేవల్ కిషన్ 64వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నేతలు గురువారం వివిధ మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దిపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శశిధర్ మాట్లాడుతూ కేవల్ కిషన్ స్ఫూర్తితో బలమైన ఉద్యమాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, శిరీష, నాయకులు అంజనేయులు, అభిషేక్, భాను, కళావతి, జనార్దన్, రిషి తదితరులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ కేవల్ కిషన్ మెదక్ ప్రాంతంలో భూపోరాట ఉద్యమాలు నిర్వహించి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. చెరువుల నిర్మాణం, మరమ్మతుల కోసం ఉద్యమాలు చేసి సాధించారని గుర్తుచేశారు. స్వామి, రంగారెడ్డి, వెంకటచారి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. దుబ్బాక మండల కార్యదర్శి సంగిరెడ్డి నవీన మాట్లాడుతూ కేవల్ కిషన్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. భాస్కర్, సాజిద్, మల్లేశం, రాజు తదితరులు ఉన్నారు.



సిద్దిపేటఅర్బన్: పూలమాల వేస్తున్న శశిధర్

నేడు వాహనాల వేలం

హుస్నాబాద్: హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ పవన్ గురువారం తెలిపారు. ఈ వేలం పాట స్టేషన్ ఆవరణలో ఉదయం 11గంటలకు జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని సీఐ పవన్ సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

గజ్వేల్: మండలంలోని కొడకండ్ల సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతుల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజ్ఞాపూర్ ఏఈ సత్యం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్ల, రిమ్మనగూడ, దాతర్‌పల్లి, బూర్గుపల్లి, రాయవరం గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

శ్రీనివాస్ అరెస్టు అప్రజాస్వామికం

గజ్వేల్/సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టుపై ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. గురువారం పలుచోట్ల విలేకరుల సమావేశాలు నిర్వహించి శ్రీనివాస్ అరెస్టు అప్రజాస్వామికం అన్నారు. గజ్వేల్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరమ్ రాష్ట్ర వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, నాయకులు నూనె కుమార్, చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగినందుకే శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కేసులు, అరెస్టులతో బీఆర్ఎస్ నేతలను భయపెట్టాలని చూస్తే అది భ్రమే అవుతుందన్నారు. అలాగే సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి మాట్లాడుతూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర సభ్యుడిగా ఫణీందర్

సిద్దిపేటరూరల్: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నారాయణరావుపేటకు చెందిన జిల్లెల్ల ఫణీందర్ ఎంపికయ్యారు. సిద్దిపేటలో జరుగుతున్న 43వ రాష్ట్ర మహాసభల్లో ఆయనను నియమించారు. ఈ సందర్భంగా ఫణీందర్ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో రాష్ట్ర శాఖ పదవిని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

సమస్యలపై ప్రభుత్వ వైఖరి సరికాదు

- సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు
- 17వ రోజుకు చేరిన సమ్మె



మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం నాయకురాలు

సిద్దిపేటరూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారంతో 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలపై ప్రభుత్వం చూపుతున్న వైఖరి సరికాదన్నారు. ఇరవైయేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్‌చేసి, ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని బెనిఫిట్స్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తమపై శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న చేసిన అసత్య ఆరోపణలను వెనక్కితీసుకోవాలన్నారు. సమ్మెకు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం సంఘీభావం తెలిపింది. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకిషన్, నవీన్‌కుమార్, కరుణాకర్, కృష్ణవేణి, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, సురేందర్, రాజేశ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను అరికట్టడం అందరి బాధ్యత

- సీఐ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వాటిని అరికట్టే బాధ్యత అందరిపైనా ఉందని సీఐ పాలెపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దుబ్బాకతో పాటు మండల పరిధిలోని హబ్సీపూర్ గ్రామంలో పలు పాన్, కిరాణా దుకాణాల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఆయన గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను ఎవరైనా విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్

చెరువుల మరమ్మతులు విస్మరించారు

- బాలుడి మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల మరమ్మతులను విస్మరించిందని, దీంతో నేటికీ అనేక ప్రమాదాలకు కారణమవుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మచ్చవాని కుంట ఆవరణలో పతంగి ఎగరవేస్తూ చెరువులో పడి 14యేళ్ల బాలుడు మృతి చెందడం అందరినీ కలిచివేసిందన్నారు. పలు చెరువులలో గుర్రపు డెక్క నిండిపోయి ఉందని, తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.70లక్షలు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. పార్టీ నాయకులు మధు, గయాజొద్దీన్, అనిల్, ఫయాజ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కనులపండువగా శోభాయాత్ర**

గజ్వేల్‌రూరల్: అయ్యప్పస్వామి శోభాయాత్ర పట్టణంలో గురువారం కనులపండువగా సాగింది. స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా అంగడిపేట హనుమాన్ దేవాలయం వరకు అయ్యప్ప భక్తుల భజనలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్‌లు ఉప్పల మెట్టయ్య, అల్వాల బాలేశ్, గురుస్వాములు ఎర్రం శ్రీనివాస్, బొగ్గుల సురేశ్, దుర్గాప్రసాద్, బొగ్గుల సురేశ్, గంగిశెట్టి రాజు, ఎల్లంరాజు పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న ఇళ్ల సర్వే**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి, అనంతసాగర్, సికింద్లాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే గురువారం నిర్వహించారు. అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చిక్కుడు అనిల్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని చెప్పారు.

◆ **ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు**



చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు పాకులాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్తారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. చిన్నకోడూరులో గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కనకరాజు, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేకనే తమ నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయకుండా అక్రమ అరెస్టులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు.

◆ **ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా రవీందర్**

కొండపాక(గజ్వేల్): కొండపాకకు చెందిన మంతెన రవీందర్ చేనేత ఐక్య వేదిక సంఘం మండల అధ్యక్షుడిగా గురువారం నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నుంచి నియామక పత్రం అందింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ చేనేత సంఘం బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

◆ **రూ.15వేల ఆర్థిక సహాయం**

మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్ట మండల పరిధిలోని జాలపల్లికి చెందిన గుండెల్లి సత్తెమ్మ కనకయ్యల కుమార్తె కల్యాణి వివాహానికి, మద్దూరు మాజీ జెడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి గురువారం హాజరై రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కమలాకర్ యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు సాగర్‌గౌడ్, వార్డ్ సభ్యులు వెంకటేశ్, లత, సాగర్, జంపన్న, స్వప్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు అనంత మహాలక్ష్మీదేవి జపం**

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ అనంత మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం మాధవానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో గోధుమలతో శ్రీమాత్రే నమః జపం నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద ఉదయం 9నుంచి సాయంత్రం 5 వరకు ఈ జపం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

◆ **మర్యాదపూర్వక కలయిక**

దుబ్బాక: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

◆ **ఘనంగా అయ్యప్ప పడిపూజ**



హుస్నాబాద్: సిద్దేశ్వరగుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయంలో గురువారం రాత్రి పడిపూజ ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ సి.వెంకటేశ్‌శర్మ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయం మారుమోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్, చంద్రయ్య, గురుస్వాములు, అయ్యప్ప మాల ధారులు పాల్గొన్నారు.